సాక్షి సిద్దిపేట

శనివారం । 27 । జూలై । 2024



డిపాజిట్.. రుణాల్లో కట్

బ్యాంకులు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ రైతుల నుంచి డిపాజిట్లు చేయించుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు.


వివరాలు 10లో ▸



ప్రతిభకు ప్రోత్సాహం

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పేరిట ఏటా ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తుంది.

వివరాలు 10లో ▸



సుందరీకరణకు ప్రణాళికలు

హుస్నాబాద్ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇటీవల మంత్రి సమక్షంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

హక్కుల సాధనకు పోరాటం

భారతీయ మజ్దూర్ సంఘ్ అధ్యక్షుడు శ్రీనివాస్



నూతన కార్యవర్గానికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న శ్రీనివాస్

సిద్దిపేటజోన్: అసంఘటిత కార్మికుల న్యాయమైన హక్కుల సాధనకు సమష్టిగా పోరాటం సాగిస్తామని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, దక్షిణ క్షేత్ర సంఘటన కార్యదర్శి రాజు అన్నారు. శుక్రవారం జరిగిన జిల్లా బీఎంఎస్ సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈఎస్ఐ, పీఎఫ్ కార్మికులకు అందించడం లేదన్నారు. బీడీ కార్మికులకు ఇచ్చే రూ.4వేల పెన్షన్ ఇవ్వడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా నూతన యూనియన్‌ను ఎన్నుకున్నారు. భారతీయ జీవిత బీమా ఏజెంట్ సంఘ్ సిద్దిపేట శాఖ అధ్యక్షుడిగా సాయి, ప్రధాన కార్యదర్శిగా మైపాల్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజశేఖర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.

రైతులకు అందుబాటులో శ్రీగంధం మొక్కలు



అటవీ కళాశాలలోని నర్సరీలో శ్రీగంధం మొక్కలు

ములుగు(గజ్వేల్): ములుగు అటవీ కళాశాలలో శ్రీగంధం మొక్కలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని కేర్ సొసైటీ జనరల్ సెక్రటరీ, సహాయ ఆచార్యులు డా.మిలకురి చిరంజీవ రెడ్డి తెలిపారు. అటవీ కళాశాల, పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఆగ్రోఫారెస్ట్రీ రీసెర్చ్, ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్(కేర్) సొసైటీ ద్వారా 1,75,00 నాణ్యమైన శ్రీ గంధం మొక్కలను పెంచుతున్నామని వివరించారు. ప్రస్తుతం సుమారు పది నెలల వయస్సు కలిగిన మొక్కలు రైతులకు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు, గంధపు చెక్క పరిశ్రమ అభివృద్ధికి సొసైటీ సహకారం అందిస్తుందన్నారు. శ్రీగంధం హార్టు వుడ్ ధర కిలోకు రూ.6వేలు ఉండగా ఒక ఎకరానికి సగటున 5వేల కిలోల దిగిబడి అంచనాతో 15 నుంచి 20 ఏళ్ల తర్వాత సుమారుగా రూ.3 కోట్ల ఆదాయాన్ని పొందవచ్చునని చిరంజీవరెడ్డి వివరించారు. శ్రీ గంధం మొక్కలు, సాగు సూచనలకు తోటల పెంపకంలో మెలకువల కోసం 73309 69580 నంబరును సంప్రదించాలని ఆయన రైతులకు సూచించారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం



బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి తీవ్ర అన్యాయం చేసిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ అన్నారు. 15శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి, కేవలం 7.3శాతం నిధులు మాత్రమే కేటాయించారన్నారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ విద్యారంగానికి బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించడం సరికాదన్నారు. ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే విద్య, వైద్యం, సత్వర న్యాయం, మౌలిక సౌకర్యాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గురుకులాలు, వసతిగృహాలు, పాఠశాలల నిర్వహణకు ఈ నిధులు ఏ మాత్రం సరిపోవన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు బత్తుల అభి, లక్ష్మణ్, అజయ్, అరుణ్, నవీన్ కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరణ

సిద్దిపేటకమాన్: ట్రాఫిక్ పోలీసు స్టేషన్ నూతన సీఐగా కె.ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ అనురాధను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. సీపీ మాట్లాడుతూ సిద్దిపేట పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ గురించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు, ఆటో డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగహన కల్పించాలన్నారు.

భూ మాయ!

నకిలీ దస్త్రాలతో రిజిస్ట్రేషన్లు

- యథేచ్ఛగా భూ కబ్జాలకు పాల్పడుతున్న నేతలు
- మున్సిపాలిటీలలో ఇష్టారాజ్యంగా ఇంటి నంబర్ల జారీ
- అక్రమార్కులతో సబ్ రిజిస్ట్రార్ల కుమ్మక్కు
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు

సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట పట్టణం శివాజీనగర్‌లో రూ.కోట్ల విలువ చేసే భూమిపై కొందరు రాజకీయ నాయకుల కన్నుపడింది. ఇంకేముంది పలుకుబడి ఉపయోగించి.. నకిలీ దస్త్రాలు సృష్టించి కబ్జా చేశారు. సిద్దిపేట మున్సిపాలిటీలో 30 సెప్టెంబర్ 2022న ఇంటినంబర్ 8–2–66/ఏ/1ను జారీ చేయించారు. ఓ వృద్ధురాలి పేరుపై దరఖాస్తు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే ఆ వార్డుకు చెందిన కౌన్సిలర్.. సదరు అధికారిని మేనేజ్ చేసి ఇంటినంబర్‌ను తీసుకున్నారు. వెంటనే సదరు వృద్ధురాలి నుంచి ఓ కౌన్సిలర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్, ఓ కుల సంఘం నాయకుడు, ఇంకొకరు పేర్ల మీద నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 1 అక్టోబర్ 2022న 325 గజాల భూమిని సిద్దిపేట అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 11568/2022 స్కాన్ నంబర్‌తో వారి పేర్ల మీదకు బదలాయించుకున్నారు. అదే డాక్యుమెంట్‌ను చూపించి 8 డిసెంబర్2022న మరో మహిళకు ఈ భూమిని విక్రయించారు. అయితే ఆ స్థలం ఇరవై ఏళ్లుగా నందిశ్వరి అనే మహిళ ఆధీనంలో ఉంది. విషయం తెలియడంతో కలెక్టర్, సీపీలకు తమ సమస్యను విన్నవించారు. దీంతో సదరు ఇంటినంబర్‌ను రద్దు చేశారు. పోలీసులు విచారణ చేపట్టి ఆరుగురిపై సిద్దిపేట వన్‌టౌన్‌లో ఈ నెల 25న కేసు నమోదు చేశారు.

– సిద్దిపేట పట్టణం నీలకంఠేశ్వర స్వామి దేవాలయం సమీపంలోని 1865 సర్వే నంబర్‌లో 3 ఎకరాల భూమిపై ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడి అనుచరుల దృష్టిపడింది. వీరరాఘవులు అనే వ్యక్తి చనిపోకముందు తమకు శంషాబాద్, సిద్దిపేటలోని 1865 సర్వే నంబర్‌లోని 3,900 గజాల భూమిని తమకు జీపీఏ చేశారని నకిలీ పేపర్లను సృష్టించారు. వాటితో 2022లో ఓ ఇద్దరు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అది కూడా సిద్దిపేట అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే రిజిస్ట్రేషన్ చేశారు. ఇటీవల పోలీసులకు వీరరాఘవులు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే స్పందించారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో నిత్యకృత్యమయ్యాయి.

భూముల విలువలు పెరగడంతో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు నేతలు కన్నేస్తున్నారు. రోజురోజుకు సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాలలో భూకబ్జాలు ఎక్కువగా పెరిగిపోతున్నాయి. భూ బకాసురులు పెడుతున్న ఇబ్బందులను తట్టుకోలేక పలువురు పోలీసులను ఆశ్రయిస్తుండటంతో రక్షణ కల్పిస్తున్నారు. మరోవైపు మున్సిపాలిటీలలో ఇష్టారాజ్యంగా ఇంటి నంబర్లు జారీ చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటి స్థలం డాక్యుమెంట్లు పరిశీలించకుండానే కౌన్సిలర్లు చెప్పినట్లు ఇంటి నంబర్లు కేటాయిస్తున్నారు. శివాజీనగర్‌లో ఎలాంటి పేరు లేకుండా ఇంటి నంబర్‌ను సిద్దిపేట మున్సిపల్ అధికారులు కేటాయించారు. అదే ఇంటి నంబర్‌ను కేటాయించకపోతే భూ కబ్జా జరిగి ఉండేది కాదని పలువురు అంటున్నారు.

సబ్ రిజిస్ట్రార్ల సహకారం..

తప్పుడు పత్రాలను సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయడంలో భూ బకాసురులకు పలువురు సబ్ రిజిస్ట్రార్లు సహకరిస్తున్నారు. స్థలం, ఇంటికి సంబంధించిన ఎలాంటి దస్త్రాలు లేకున్నా రిజిస్ట్రేషన్లు యథేచ్ఛగా చేస్తున్నారు. డాక్యుమెంట్ రైటర్‌ల ద్వారా ముందుగా మాట్లాడుకుని నకిలీ రిజిస్ట్రేషన్‌లకు ఆజ్యం పోస్తున్నారు. కేటాయించిన ఇంటి నంబర్‌పై ఎవరి పేరు లేకున్నా పలు రిజిస్ట్రేషన్లు జరుగుతుండటం గమనార్హం.

మోసపోతున్న కొనుగోలు దారులు

రిజిస్ట్రేషన్ పేపర్లు ఉండటంతో కొనుగోలు చేసిన వారు మోసపోతున్నారు. కొనుగోలు చేసిన వారిని నమ్మించేందుకు ఆక్రమించిన స్థలంలో భయభ్రాంతులకు గురి చేసి ప్రహరీ గోడలు నిర్మిస్తున్నారు. ఇలా భూ కబ్జాలు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు యథేచ్ఛగా పాల్పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి భూ బకాసురుల నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.



సిద్దిపేట పట్టణంలో శివాజీనగర్‌లో నకిలీ పత్రాలను సృష్టించి కబ్జా చేసిన భూమి ఇదే



ఇంటి నంబర్‌పై ఎలాంటి పేరు లేకుండానే జారీ చేసిన సిద్దిపేట మున్సిపల్ అధికారులు

కఠిన చర్యలు తప్పవు



నకిలీ డాక్యుమెంట్లు, డబుల్ రిజిస్ట్రేషన్స్‌పై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయి. భూ ఆక్రమణలు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నాం. వీటిపై మున్సిపల్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ వారికి లేఖలు రాస్తున్నాం. తప్పుడు పత్రాలు సృష్టించి భూమి కబ్జాలకు పాల్పడుతున్న వారికి కఠిన చర్యలు తప్పవు.

– అనురాధ, సీపీ

ఆయిల్‌పాం సాగు లక్ష్యం చేరాలి



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- ఆయిల్‌ఫెడ్, వ్యవసాయ అధికారులకు దిశానిర్దేశం

సిద్దిపేటరూరల్: అత్యంత లాభదాయకమైన ఆయిల్‌పాం పంట సాగులో లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఆయిల్‌ఫెడ్, ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు 11,373 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు అవుతోందని, ఈ ఏడాది మరో 4వేల ఎకరాలు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఈ క్రమంలో 2,816 ఎకరాలు రిజిస్ట్రేషన్ పూర్తి చేసి 268 ఎకరాల్లో మొక్కలు నాటినట్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ రైతులను ప్రోత్సహిస్తూ సాగు చేపట్టేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు రైతుల ఇంటికి వెళ్లి ఆయిల్‌పాం వల్ల కలిగే లాభాలను గురించి తెలియజేయాలన్నారు. రైతులతో అధికారులు సమావేశమై చిన్న, సన్నకారు రైతులను కూడా సాగువైపు మళ్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మహేశ్, జిల్లా ఉద్యానశాఖ అధికారి సువర్ణ, ఆయిల్‌ఫెడ్ కన్సల్టెన్సీ అధికారి రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డిప్యూటీ సమాచార ఇంజనీరు..

జిల్లా ఉప కార్యనిర్వాహక సమాచార ఇంజనీరుగా నియమితులైన భూపాల్‌రెడ్డి శుక్రవారం కలెక్టర్ మనుచౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో డీపీఆర్‌ఓ రవికుమార్, అసిస్టెంట్ సమాచార ఇంజనీర్ తిరుపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటకమాన్: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మొక్కలు నాటడంతో పాటు అవి పెరిగి ఫలాలు అందించే వరకు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. దేశ వ్యాప్తంగా మొక్కలు నాటాలన్న యూనియన్‌బ్యాంకు పిలుపు మేరకు సిద్దిపేట పట్టణంలోని రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో యూనియన్ రీజినల్ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మొక్కను నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగమై పచ్చదనం పెంపునకు ముందుకు రావడం అభినందనీయన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, రీజినల్ మేనేజర్ వికాస్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ రాఘవ, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్



సిద్దిపేట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దేశభక్తిని పెంపొందించాలి

- అదనపు డీసీపీ మల్లారెడ్డి
- సిద్దిపేటలో కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ

సిద్దిపేటకమాన్: విద్యార్థుల్లో చిన్న నాటి నుంచే దేశభక్తిని పెంపొందించాలని అదనపు డీసీపీ మల్లారెడ్డి అన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని విద్యార్థులు పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్లారెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. దేశభక్తి నినాదాలతో.. విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ మోడ్రన్ బస్టాండ్ అంబేడ్కర్ సర్కిల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ..దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరులను స్మరిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజానికి మన వంతుగా ఏం చేశామనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా కార్గిల్‌లో పోరాటం చేసిన వీర జవాన్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

- ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేయాలి
- అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేటఅర్బన్: పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమని, దీంతో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తమని తాము కాపాడుకోవచ్చని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల గ్రామంలో పర్యటించారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి వర్షం నీరు నిల్వ ఉండడం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది గ్రామాలకు వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించాలని, జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి నమూనాలను సేకరించి పరీక్షలను నిర్వహించి తగిన చికిత్స అందించాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల పరిశీలన..

బక్రిచెప్యాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న బోధన, వసతులను పరిశీలించారు. అంగన్‌వాడీ ఆవరణలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి ఆర్గానిక్ కూరగాయలు, ఆకుకూరలను విద్యార్థులకు వడ్డించాలని సూచించారు.



నీటి ట్యాంకును పరిశీలిస్తున్న గరీమా అగర్వాల్, అధికారులు

విజయ లక్ష్యంతో సాగండి

సిద్దిపేటజోన్: శిక్షణ శిబిరంలో నేర్చుకున్న మెలకువలతో విజయమే లక్ష్యంగా ఆడాలని రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పాల్గుణ సూచించారు. కొన్ని రోజులుగా సిద్దిపేట స్టేడియంలో జాతీయ జూనియర్ బాలికల టోర్నీకి వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారిణిలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శిక్షణ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. బాగా ఆడి రాష్ట్రం పేరును నిలపాలని సూచించారు. శిక్షణ పొందిన మీరంతా త్వరలో కర్నాటకలో జరిగే జాతీయ ఛాంపియన్స్ ట్రోఫీలో ప్రతిభ చూపాలన్నారు.

ఫసల్ బీమాపై స్పష్టత వచ్చేనా?

- మార్గదర్శకాల కోసం ఎదురుచూపులు
- ఇప్పటికే ముగిసిన పత్తి, మొక్కజొన్న పంటల ప్రీమియం గడువు
- వరి సాగుకు ఇంకా కొద్ది రోజులే..

గజ్వేల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేయాలనుకుంటున్న 'ఫసల్ బీమా'కు ఇంకా మార్గదర్శకాలు విడుదల కాలేదు. ఈ పథకానికి సంబంధించి రైతులపై భారం లేకుండా ప్రీమియం కూడా ప్రభుత్వమే భరించడానికి సన్నద్ధమవుతోంది. కానీ పత్తి, మొక్కజొన్న పంటల ప్రీమియం ముగుస్తుండగా, వరి సాగుకు ఇంకా కొద్ది రోజులే మిగిలి ఉన్నది. ఈ పథకాన్ని గడువు పొడిగించి అమలు చేస్తారా? లేదా వచ్చే సీజన్‌లో అమలు చేస్తారా? అనే విషయంలో ఇంకా స్పష్టత రాలేదు.

అయిదేళ్లుగా 'ఫసల్ బీమా' అమలుకు నోచుకోక...ఏటా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటలకు అపార నష్టం సంభవించిన వేళ...రైతుకు ఇక దేవుడే దిక్కు అనే పరిస్థితి నెలకొన్నది. గత ప్రభుత్వం కేంద్రం సహకారంతో అమలవుతున్న ఈ పథకం నుంచి వివిధ కారణాల వల్ల వైదొలగడమే ఇందుకు కారణం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ విషయాన్ని గుర్తించి పథకాన్ని పునరుద్ధరించడానికి నిర్ణయించిన సంగతి తెలిసిందే. గతంలో ఈ పథకం అమలైనప్పుడు.. ప్రభుత్వం మొక్కజొన్న ఎకరాకు రూ. 25వేల బీమా సౌకర్యాన్ని కల్పించగా రైతు ఇందులో 2శాతంగా అంటే రూ. 500 ప్రీమియంగా చెల్లించాల్సివచ్చేది. వరి ఎకరాకు రూ.34వేల బీమా వర్తింపునకు 2శాతంగా రూ. 680ప్రీమియం, కంది ఎకరాకు రూ. 14వేల బీమా వర్తించే అవకాశం ఉండగా.. ఇందులో 2శాతంగా రూ. 280ప్రీమియం, పత్తికి ఎకరాకు రూ. 1750 ప్రీమియం చెల్లించాల్సి వచ్చేది. పెరిగిన ఈ ప్రీమియం కూడా ప్రస్తుతం ప్రభుత్వమే భరించడానికి నిర్ణయించింది. కొత్తగా అమలుచేయబోతున్న పథకంలో గతంలో ఉన్న మొక్కజొన్న పంటతోపాటు వరి పంటను కూడా గ్రామం యూనిట్‌గా తీసుకొని బీమా వర్తింపజేయనున్నారు. పత్తి, మొక్కజొన్న ఇతర పంటలను మండలం యూనిట్‌గా తీసుకోనున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సందర్భంలో పథకం నిబంధనల ప్రకారం రైతులకు పరిహారం చెల్లింపులు జరుగుతాయి.

ఈ సీజన్‌లో అమలు అయ్యేనా?

ఈ పథకం ప్రస్తుత వానాకాలంలో సీజన్‌లోనే అమలు కానుందని రైతులంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. కానీ పరిస్థితి భిన్నంగా ఉన్నది. గతంలో అమలు చేసిన పథకం నిబంధనల ప్రకారం... ఇప్పటికే పత్తి, మొక్కజొన్నకు సంబంధించిన ప్రీమియం గడువు ముగిసింది. వరి సాగుకు ఇంకా కొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉన్నది. కానీ పథకం అమలుపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదల కాక స్పష్టత కరువైంది. ఒకవేళ అమలు చేస్తే...గడువు పెంచుతారా? లేక వచ్చే సీజన్ నుంచి అమలు చేస్తారా? అనేది తేలాల్సి ఉన్నది. సీజన్ ప్రారంభంలో 45రోజులుగా వర్షాలు పత్తా లేకపోవడం వల్ల మొలక దశలో పత్తి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సగానికిపైగా పంటలు సరిగా మొలకెత్తలేదు. ఆలస్యంగా వర్షాలు కురుస్తున్నా...పత్తి, మొక్కజొన్న జరగాల్సిన నష్టం జరిగిపోయంది. ఈ సమయంలో పంటల బీమా సకాలంలో అమలు చేసి ఉంటే తమకు మేలు జరిగేదని రైతులు అంటున్నారు.



జిల్లాలో పత్తి సాగు

స్పష్టత ఇవ్వాలి



'ఫసల్ బీమా' అమలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయం. గతంలో పంట నష్టం జరిగితే పట్టించుకునే నాథుడే ఉండేవారు కాదు. ప్రస్తుత ప్రభుత్వం చొరవ అభినందనీయం. కానీ పథకం అమలుపై వెంటనే స్పష్టత ఇస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– నరేందర్‌రెడ్డి, రైతు, ధర్మారెడ్డిపల్లి, గజ్వేల్

మార్గదర్శకాలు రాగానే..



'ఫసల్ బీమా' అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ పథకం వల్ల రైతులకు మేలు జరగనుంది. మార్గదర్శకాల కోసం ఎదురుచూస్తున్నాం. రాగానే రైతులందరికీ వర్తింపజేస్తాం.

–మహేశ్, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి

బీఆర్ఎస్, బీజేపీ తీరు మారాలి

- ప్రభుత్వంపై కావాలనే ఆరోపణలు
- డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్: పేదల సంక్షేమానికి భరోసా ఇస్తూనే రైతుల అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం గజ్వేల్‌లోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాల తీరుపై మండిపడ్డారు. ప్రభుత్వంపై బురదజల్లడం మానుకొని ఇప్పటికైనా తమ తీరును బీఆర్ఎస్, బీజేపీలు మార్చుకోవాలన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు ప్రాధాన్యతనిస్తూ రైతుల సంక్షేమానికి బాటలు వేస్తూ సాగిన బడ్జెట్‌ను అంతా హర్షిస్తున్నారని చెప్పారు. గతంలో ఎప్పుడూలేని విధంగా రూ.2.90లక్షల కోట్లతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కలు బడ్జెట్ ప్రవేశపెట్టి తమదైన శైలిని చాటుకున్నారని కొనియాడారు.

శివాలయ భూములు పరిరక్షిస్తా..

గజ్వేల్‌లో శివాలయం భూముల పరిరక్షణకు తానూ ముందుంటానని నర్సారెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని తిప్పికొట్టారు. అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లో సహించేదిలేదన్నారు. మాజీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి మాట్లాడుతూ కేటీఆర్ తీరు వల్లే బీఆర్ఎస్ దెబ్బతింటున్నదని చెప్పారు. అధికారం కోల్పోయినా ఆయన వైఖరిలో మార్పు రాలేదన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, కాంగ్రెస్ నియోజకవర్గ ప్రచార కమిటీ కన్వీనర్ నిమ్మ రంగారెడ్డి, నాయకులు సర్ధార్‌ఖాన్, నక్క రాములుగౌడ్, మొనగారి రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

క్లుప్తంగా

కేతకీలో క్రికెటర్ పూజలు



నాగేంద్రకు జ్ఞాపిక అందిస్తున్న ఈఓ

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయంలో రంజీట్రోఫీ క్రికెటర్ నాగేంద్ర ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహామంగళ హారతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి, పూలమాల, శాలువాతో సన్మానించారు. అదే విధంగా ఆలయ ఈఓ శశిధర్ జ్ఞాపికను అందించారు.

ఈఓగా శశిధర్ బాధ్యతల స్వీకరణ

కేతకీ ఆలయ ఈఓగా శశిధర్‌కు బుధవారం ఉమ్మడి దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ బాధ్యతలను అప్పగించగా, శుక్రవారం విధుల్లో చేరారు.

'మై స్లేట్' ఆవిష్కరణ



మై స్లేట్ గురించి మంత్రి శ్రీధర్‌బాబుకు వివరిస్తున్న ఉపాధ్యాయుడు కేటీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు) తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు కేటీ నాయక్, సతీమణి కవిత రూపొందించిన మై స్లేట్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు కేటీ నాయక్ మాట్లాడుతూ.. ఈ మైస్లేట్ అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, వయోజన విద్య అక్షరాస్యత సాధనకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దీనిపై తెలుగు, ఇంగ్లిష్, గణితం అభ్యసనం చేయొచ్చన్నారు. మై స్లేట్ మీద పూర్తి కాపీ రైట్, ట్రేడ్ మార్క్ పేటెంట్ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈపలకను అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలో ఉపయోగిస్తే పునాది విద్యకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ దంపతులిద్దరినీ అభినందించారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న నాయకత్వంలో ఆగస్టు 9న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద మాదిగల మహాధర్నా ఉంటుందని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం మెదక్ ఐబీలో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు బీజేపీ ఏబీసీడీ వర్గీకరణ వంద రోజుల్లో చేస్తానని చెప్పి 11 ఏళ్లు అయినా చేయకపోవడం విచారకరమన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశంలో వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏరోళ్ల సంజీవయ్య మాదిగ, ఎర్ర లింగ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు రూపుల్ల నర్సింహులు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్.. రుణాల్లో కట్





ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు దుంపలపల్లి స్వామి. ఇతడిది దుబ్బాక మున్సిపాల్టీలోని ధర్మాజీపేట. ప్రభుత్వం చేసిన రుణమాఫీలో తనకున్న రూ.34 వేల పై చిలుకు రుణం మాఫీ అయ్యింది. శుక్రవారం రైతు స్వామి రుణం ఉన్న ఉమ్మడి దుబ్బాక మండలంలోని చిట్టాపూర్ ఏపీజీవీబీ బ్యాంక్‌కు పత్రాలు తీసుకొని వెళ్లగా నీ రుణం మాఫీ అయ్యిందని చెప్పారు. కొత్తగా మళ్లీ రూ.34 వేలు ఇస్తున్నామని, అందులో నుంచి రూ.5 వేలు డిపాజిట్ చేసుకొని మిగితా రూ.29 వేలు నీ ఖాతాలో వేశామని పేర్కొన్నారు. మళ్లీ ఏడాదికి నీ రుణం రెన్యువల్ చేసినప్పుడు ఈ రూ.5వేలు ఉపయోగపడుతాయన్నారు. నీకే కాదు రైతులందరికీ డిపాజిట్లు చేస్తున్నామని చెప్పడంతో ఏం చేయాలో తోచక స్వామి అయోమయంతో ఇంటికి వచ్చాడు. ఇది ఈ ఒక్క రైతు సమస్యే కాదు.. చిట్టాపూర్ ఏపీజీవీబీ బ్యాంకు పరిధిలో రుణమాఫీ పొందిన రైతులందరిదీ.

- కొత్త రుణాల్లో కోత పెడుతున్న ఏపీజీవీబీ బ్యాంకులు
- తీసుకునే నగదు బట్టి రూ.10 వేల నుంచి రూ.15 వేలు
- ఎందుకని అడిగితే మీ కోసమే అంటున్న అధికారులు
- అయోమయంలో రైతులు

దుబ్బాక : కాంగ్రెస్ ప్రభుత్వం తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఆ మేరకు మొదటి విడతగా రూ.లక్షలోపు ఉన్న వారి రుణాలని ఇటీవలె మాఫీ చేశారు. అయితే, కొన్ని బ్యాంకులు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ రైతుల నుంచి డిపాజిట్లు చేయించుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రుణం మాఫీ అయిన రైతులు భూంపల్లి-అక్బర్‌పేట మండలంలోని చిట్టాపూర్ ఏపీజీవీబీ బ్యాంక్‌కు వెళ్తే కొత్తగా ఇచ్చే రుణంలో నుంచి కొంత డబ్బులను రైతులకు తెలియకుండానే వారి పేరిట డిపాజిట్లు చేస్తూ మిగిలిన డబ్బులను ఖాతాలో వేస్తున్నారు.

7.5 శాతం వడ్డీ వస్తుందని..

తమకు ఎక్కువ రుణం వస్తే ఇంత తక్కువగా ఇస్తున్నారంటూ బ్యాంకు అధికారులను అడిగితే మీ పేరిట డిపాజిట్ చేశామని చెబుతున్నారు. మాకు డబ్బులు కావాలి ఎందుకు డిపాజిట్ చేశారంటూ రైతులు అడిగితే మాఫీ అయిన వారు కొంత డిపాజిట్ చేస్తున్నారని ఇది మీకే లాభమని 7.5 శాతం వడ్డీ వస్తుందని, మళ్లీ ఏడాదికి మీ రుణం రెన్యువల్ చేసినప్పుడు మీ దగ్గర డబ్బులు ఉండవని, ఈ డిపాజిట్ డబ్బులు ఉపయోగపడుతాయని చెబుతున్నారు. దీంతో ఏం చేయాలో తోచక రైతులు అయోమయానికి గురవుతున్నారు.



రుణం తీసుకునేందుకు చిట్టాపూర్ బ్యాంక్‌కు వచ్చిన రైతులు

జిల్లాలోని పలు ఏపీజీవీబీల్లో ఇదే తీరు..

చిట్టాపూర్ ఏపీజీవీబీ ఒక్క బ్యాంకులోనే కాదు జిల్లాలోని పలు ఏపీజీవీబీ బ్యాంకుల్లో రైతుల రుణం డబ్బుల్లో నుంచి డిపాజిట్లు చేసుకుంటున్నట్లు తెలిసింది. రైతుల రుణాన్ని బట్టి రూ.5 వేలు, రూ.10 వేలు ఇలా డిపాజిట్లు చేయించుకోవడమే కాకుండా రైతులకు కనీసం అర్థమయ్యేటట్లు కూడా చెప్పకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం డిపాజిట్లకు సంబంధించిన బాండ్‌లు కూడా ఇవ్వడం లేదని రైతులు బ్యాంకుల తీరుపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో స్పందించి తమకు న్యాయం చేయాలంటూ రైతులు వేడుకుంటున్నారు.

10 వేలు డిపాజిట్ చేసుకుండ్రు



నాకు రూ.80 వేల రుణమాఫీ అయింది. దీంతో చిట్టాపూర్ ఏపీజీవీబీ బ్యాంక్‌కు వెళితే రుణం మాఫీ అయ్యిందని మళ్లీ కొత్తగా లోన్ ఇచ్చింండ్రు. ఇందులో నుంచి రూ.10 వేలు డిపాజిట్ చేసింండ్రంట. నాకు ఏం అర్థం కాలేదు. మా కొడుకు బ్యాంక్ సార్‌ను అడిగితే రుణ మాఫీ అయిన రైతులకు డిపాజిట్లు చేస్తున్నామని చెప్పింండ్రు.

– గంగమణి రైతు, పోతారెడ్డిపేట

మీకే లాభం అంటున్నారు



నాకు రూ.31 వేలు మాఫీ అయ్యింది. మళ్లీ కొత్తగా చిట్టాపూర్ బ్యాంకులో రుణం ఇచ్చింండ్రు. ఇందులో నుంచి రూ.3500 డిపాజిట్ చేసింండ్రంటా. వద్దు సార్ అన్నా అందరికీ చేశాం నీకొక్కనికే కాదు అంటూ చెప్పింండ్రు. నీకే లోన్ రెన్యువల్ చేసినప్పుడు ఈ డిపాజిట్ డబ్బులు ఉపయోగపడుతాయని చెబుతుండ్రు. నాకు ఏం డిపాజిట్ బాండ్ పేపర్ ఇయ్యలేదు.

– కల్వల లక్ష్మయ్య, రైతు

రైతులకు ఉపయోగం కోసమే..



రైతుల రుణాన్ని బట్టి కొంత డబ్బులు డిపాజిట్ వారి పేరిట చేస్తున్నాం. మాకు పై అధికారులు ఎవరు చెప్పలే. రైతుల ఉపయోగం కోసమే డిపాజిట్ చేస్తున్నాం. లోన్ రెన్యువల్ చేసినప్పుడు ఈ డిపాజిట్ డబ్బుల్లో నుంచే కట్టుకోవచ్చు. రైతుల నుంచి బలవంతంగా చేయట్లేదు వారికి చెప్పే చేస్తున్నాం. రైతుల రుణం మొండి బాకాయి కాకుండా ఉండాలనే ఉద్దేశ్యంతోనే చేస్తున్నాం తమ బ్యాంకు పరిధిలో రూ.లక్ష లోపు 1200 మంది రైతులకు రుణం మాఫీ వచ్చింది.

– అనిరుధ్, చిట్టాపూర్ ఏపీజీవీబీ మేనేజర్

డిపాజిట్ల నిబంధనలు లేవు

రైతుల రుణమాఫీ విషయంలో బ్యాంకులకు కొత్తగా రుణాలు ఇచ్చే సమయంలో డిపాజిట్లు చేసుకోవాలన్న నిబంధనలు ఏం లేవు. కొన్ని ఏపీజీవీబీ బ్యాంకుల్లో డిపాజిట్లు చేయించుకుంటున్నట్లు తెలిసింది. దీనిపై సంబంధిత బ్యాంక్ ఆర్ఎంతో మాట్లాడి తగు విధంగా చర్యలు తీసుకుంటాం.

– హరిబాబు, లీడ్ బ్యాంక్ మేనేజర్

రైతు సంక్షేమమే ధ్యేయంగా బడ్జెట్

కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి



మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

మెదక్ జోన్ : రైతు సంక్షేమమే ధ్యేయంగా బడ్జెట్‌లో వ్యవసాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పబ్బతి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రవేశపెట్టిన మెనిఫెస్టోను కచ్చితంగా అమలు చేస్తుందని, అందులో భాగంగానే రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీని ప్రారంభించిందని గుర్తు చేశారు. జిల్లా రైతాంగం తరపున పార్టీ అధిష్టానానికి, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఊకదింపుడు ఉపన్యాసాలు మానుకోవాలని సూచించారు. బీజేపీతో బీఆర్ఎస్ చీకటి ఒప్పందాలు కుదుర్చుకున్నది వాస్తవమే అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గూడూరి ఆంజనేయులు, బ్లాక్ పార్టీ అధ్యక్షుడు హఫజీ మోల్సాబ్, పార్టీ మండల నాయకులు పేరూర్ శంకర్, నాగిరెడ్డి, ముజీబ్, గోపాల్‌తోపాటు పాల్గొన్నారు.

హైనా దాడిలో జీవాలు మృతి



మృత్యువాత పడిన జీవాలు



దూడ కళేబరాన్ని పరిశీలిస్తున్న బాధిత రైతు కుటుంబం

మద్దూరు(హుస్నాబాద్): హైనా దాడిలో జీవాలు మృత్యువాత పడిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కోడూరి సిద్దిఖీ అనే రైతు తనకున్న వ్యవసాయ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవాలను పెంచుతున్నాడు. ఎప్పటి మాదిరిగానే గురువారం రాత్రి సమయంలో బావి వద్ద గల షెడ్డులో జీవాలను పంపి ఇంటికి వెళ్లాడు. తెల్లవారుజామున వెళ్లి చూడగా హైనా దాడిలో 14 జీవాలు మృతి చెందడంతోపాటు ఆరు జీవాలు తీవ్రంగా గాయపడి ఉన్నాయి. ఈ ఘటనలో రూ.2 లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. నష్టపోయిన తనను ప్రభుత్వ ఆర్థికంగా ఆదుకోవాలని రైతు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశాడు.

చిరుత దాడిలో దూడ..

రామాయంపేట(మెదక్): చిరుత దాడిలో దూడ మృతి చెందిన ఘటన మండలంలోని తొనిగండ్ల గ్రామ శివారులో శుక్రవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రైతు పోటిగారి రమేశ్ రోజూ మాదిరిగానే తన పశువులను పటేల్‌కుంట సమీపంలో వ్యవసాయ భూమి వద్ద ఉంచాడు. రాత్రి పశువుల మందపై చిరుత దాడి చేసి దూడను హతమార్చింది. ఉదయం వ్యవసాయ బోరు వద్దకు వెళ్లిన రమేశ్ మృతి చెందిన దూడ, చిరుత అడుగులను చూసి అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశాడు. రైతును ఆదుకోవాలని ఆ శాఖ అధికారులకు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

ప్రేమించి పెళ్లికి నిరాకరించాడని

- ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



శ్రీవాణి (ఫైల్)

కొండపాక(గజ్వేల్): ప్రేమించిన వ్యక్తి మోసం చేశాడని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ కథనం మేరకు.. కొండపాక మండలంలోని బందారం గ్రామానికి చెందిన శ్రీవాణి సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తుంది. అదే మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన మంతూరి నితీష్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. పెళ్లికి కులం అడ్డురావడంతో నితీష్ నిరాకరించాడు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీవాణి 10వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబీకులు సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని శ్రీవాణి తల్లిదండ్రులకు చెప్పడంతో త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడు నితీష్‌ను ఈనెల 24న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీవాణి గురువారం రాత్రి మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

బాలిక ఆత్మహత్య

పటాన్ చెరు టౌన్: బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పటాన్‌చెరు మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన డప్పు ఎల్లయ్య కూతురు రేవతి (17) ఐదేళ్ల నుంచి మూర్ఛ వ్యాధితో బాధపడుతోంది. గురువారం ఇంటి వద్ద ఉన్న రేవతి ఇంట్లో చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మాకే తెలియకుండా ఇళ్లను అమ్మేశారు

- మాచ్నూర్ గ్రామంలో బాధితుల ఆందోళన
- తమ ఇంటిని ఇతరులపై మార్చారని ఆగ్రహం
- ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్ల కేటాయింపు
- విచారణ చేపట్టిన అధికారులు



మాచ్నూర్ గ్రామంలో బాధితుల ఇళ్ల వద్ద విచారణ చేస్తున్న అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): ఓ వైపు గ్రామస్తులు ఆందోళన చేస్తుండగానే మరో వైపు అధికారులు విచారణ చేపట్టిన ఘటన మండల పరిధిలోని మాచ్నూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు కేటాయించడం, ఇంటి పేర్లు మార్పిడి, అసెస్మెంటు అవకతవకలపై ఇటీవల మండల కేంద్రమైన ఝరాసంగంలో గ్రామ పంచాయతీ కార్యదర్శితోపాటు ఎంపీఓలపై ఎంపీడీఓకు, మండల ప్రత్యేకాధికారికి ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల ఫిర్యాదుతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం జహీరాబాద్ డీఎల్పీఓ అమృత, మండల ప్రత్యేక అధికారి ఐనిష్, ఎంపీడీఓ సుధాకర్ మొదట గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాధితులను పిలిచి విచారణ చేపట్టారు. తమ ఇంటిని కుటుంబ సభ్యులకు తెలియకుండా ఇతరులకు అమ్మినట్లు, వారిపై అసెస్మెంట్ జారీ చేసినట్లు అధికారుల ఎదుట బాధితులు వాపోయారు. గ్రామ పంచాయతీలో విచారణ చేపట్టడంపై గ్రామస్తులు అభ్యంతరం చెబుతూ కార్యాలయం బయట విచారణ చేయాలని ఆందోళన చేశారు.

సుమారు 30 మందికి పైగా..

అనంతరం గ్రామంలో పర్యటించి, బాధితులతో మాట్లాడి అధికారులు వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల కాలం నాటి ఉంటున్న తమ ఇళ్లను తమకు తెలియకుండానే ఇతరులకు ఏ విధంగా అమ్ముతారని, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా పంచాయతీ కార్యదర్శితోపాటు ఎంపీఓ కుటుంబ సభ్యుల పేర్లపై ఇంటి నంబర్లు కల్పించడం, అసెస్మెంట్ చేసుకున్నట్లు గ్రామస్తులు వెల్లడించారు. ఒకే ఇంటికి బై నంబర్లు వేసి సుమారు 10 మంది వరకు పేర్లు నమోదు చేసి, ఇంటి నంబరు వేసి అసెస్మెంటు కల్పించినట్లు తెలిపారు. గ్రామంలో ఈ విధంగా సుమారు 30 మందికి పైగా అవకతవకలు చేసినట్లు వాపోయారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. అదే విధంగా ప్రత్యేక బృందాలుగా ఏర్పడి యథావిధిగా ఇంటి నంబర్లు కేటాయించి, సమస్య పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అలాగే, గ్రామ పంచాయతీ రికార్డులు సీజ్ చేశారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్ఐ నరేశ్ సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకొని బాధితులను సముదాయించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దుబ్బాకరూరల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అప్పనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజ్ కథనం మేరకు.. సిద్దిపేట మండలం రావురుకుల గ్రామానికి చెందిన బట్టు కనకయ్య(50) ఈనెల 25న బైక్‌పై పని నిమిత్తం దుబ్బాకకు వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తున్నాడు. దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామ శివారు వద్ద వాహనం అదుపు తప్పి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్ర గాయాలు

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని చిన్నఘనపూర్ శివారు మెదక్–జోగిపేట ప్రధాన రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. కొల్చారం పోలీసుల కథనం మేరకు.. రంగంపేట గ్రామానికి చెందిన సోదరులు కోట నటరాజ్, కోట రామకృష్ణ బైక్‌పై మెదక్ నుంచి స్వగ్రామానికి వస్తున్నారు. ఐఎంఎల్ డిపో వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

పోడు పట్టాలు ఇవ్వాలి

బీజేపీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో అర్హులైన గిరిజన రైతులకు పోడు భూముల పట్టాలు ఇవ్వాలని బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రెడ్యానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బీజేపీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్యా నాయక్ మాట్లాడుతూ.. గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు, జనాభా ప్రాతిపదికన కాంట్రాక్ట్, ప్రైవేట్ రంగ సంస్థల్లో రిజర్వేషన్ కల్పించాలన్నారు. పేద గిరిజనులకు అసైన్డ్ భూములు ఇవ్వడంతోపాటు పట్టాలు పంపిణీ చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో 4.13 లక్షల మంది పోడు గిరిజన రైతులు దరఖాస్తు చేసుకుంటే కేవలం 1.65 లక్షల మందికి మాత్రమే ఇచ్చారన్నారు. ఈ ప్రభుత్వంలోనైనా గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు నాయక్, ప్రకాశ్ నాయక్, పూల్ సింగ్ నాయక్, సంతోష్ నాయక్, అనీల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అమెరికా నుంచి తమ్ముడినని చెప్పి..

మహిళ నుంచి రూ.70 వేలు కాజేసిన వ్యక్తి

జిన్నారం(పటాన్‌చెరు): అమెరికాలో నివాసం ఉంటున్న తమ్ముడినని చెప్పి ఓ వ్యక్తి మహిళను మోసం చేశాడు. ఈ ఘటన జిన్నారం మండలంలోని బొల్లారంలో చోటు చేసుకుంది. సీఐ గంగాధర్ కథనం మేరకు.. బొల్లారం మున్సిపల్ పరిధిలోని విఘ్నేశ్వర కాలనీలో మధు, ఆశారాణి నివాసం ఉంటున్నారు. ఆశారాణి తమ్ముడు కార్తీక్ అమెరికాలో ఉంటున్నాడు. కార్తీక్ లాగా అక్క ఆశారాణికి ఫోన్ ద్వారా చాట్ చేసి తనకు అర్జెంటుగా రూ.70 వేలు కావాలని అడిగాడు. ఇది నమ్మిన ఆశారాణి ఆన్‌లైన్ ద్వారా రూ.70 వేల పంపించింది. మరుసటి రోజు మరో రూ.30 వేలు కావాలని చాట్ చేయగా, అనుమానం వచ్చి సొంత తమ్ముడు కార్తీక్‌కు ఫోన్ చేయగా తాను చాట్ చేయలేదని, డబ్బు అడగలేదని స్పష్టం చేశాడు. దీంతో తాను మోసపోయానని గుర్తించి శుక్రవారం బొల్లారం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు.

ప్రతిభకు ప్రోత్సాహం

- 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' ద్వారా స్కాలర్‌షిప్‌లు అందజేత
- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరణ
- సెప్టెంబర్ 15 చివరి గడువు
- విద్యార్థులకు సదావకాశం



వేలల్లో స్కాలర్‌షిప్‌లు

మెదక్ కలెక్టరేట్: తరగతి గదుల్లో పుస్తకాలతో కుస్తీ పట్టడం వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యత పెరగదని గ్రహించిన కేంద్ర ప్రభుత్వం వారిలో సృజనాత్మకతను వెలికితీసేందుకు దృష్టి సారించింది. అందులో భాగంగా విజ్ఞాన్ భారతి, విజ్ఞాన ప్రసాద్, ఎన్‌సీఈఆర్టీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పేరిట ప్రతీయేటా ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తుంది. ఈ విద్యా సంవత్సరం (2024–25)కు కూడా దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో 178 ప్రాథమికోన్నత పాఠశాలలు, 141 ఉన్నత పాఠశాలలు, 30 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో సుమారు 69,500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటి వేలాది రూపాయల స్కాలర్‌షిప్‌లు పొందవచ్చు.

మూడు స్థాయిల్లో..

జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో పరీక్షలు నిర్వహిస్తారు. సిద్ధమవుతున్న విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా పుస్తకాలు పొందవచ్చు. ప్రతీ ఏడాది అక్టోబర్ 4వ వారంలో జిల్లా స్థాయి, డిసెంబర్ 3వ వారంలో రాష్ట్రస్థాయి, 2025 మే నెలలో జాతీయస్థాయి పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థుల దరఖాస్తులకు సెప్టెంబర్ 15తో ముగియనుంది.

పరీక్ష విధానం

ఆన్‌లైన్‌లో వంద మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలతో పరీక్ష ఉంటుంది. సైన్స్, మ్యాథ్స్ పుస్తకాల్లోని అంశాలను 70 శాతం ప్రశ్నలు ఉంటాయి. మనదేశం విజ్ఞాన శాస్త్ర రంగంలో చేస్తున్న కృషి , శాస్త్రవేత్తల జీవిత విశేషాలు, లాజిక్, రీజనింగ్‌లపై మిగతా ప్రశ్నలు ఉంటాయి.

ఈ పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో రాణించిన వారికి రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు, జాతీయస్థాయిలో ప్రతిభ చాటిన వారికి రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు నగదు పురస్కారాలు అందజేస్తారు. భాస్కర ఉపకార వేతనాల పేరిట ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు అందజేస్తుంది.

దరఖాస్తులు

విద్యార్థులు రూ.200లు చెల్లించి ఆన్‌లైన్ ద్వారా విజ్ఞాన్ మంథన్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి. ప్రత్యేక వెబ్‌సైట్ ఉంటుంది. అందులో పూర్తి వివరాలు నమోదు చేసుకున్న వారికి జూనియర్, సీనియర్ విభాగాల్లో పరీక్షల తేదీలు కేటాయిస్తారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఈ పరీక్షలు ఉంటాయి. జిల్లాలో 6వ తరగతి నుంచి జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులు.

ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలి



జిల్లాలోని ఎక్కువ మంది విద్యార్థులు ఈ పథకానికి ఎంపిక కావాలి. గణితం, సైన్స్, ఇంజనీరింగ్, శాస్త్రవేత్తల జీవిత చరిత్రలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలి. ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తే విద్యార్థులు అద్భుతాలు సృష్టిస్తారు. ఎక్కువ మంది విద్యార్థులు పథకానికి ఎంపికయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి.

– రాజిరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి